క్లుప్తంగా

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. సర్పంచ్‌గా ఆరు సార్లు ఏకగ్రీవంగా చేయడమే కాకుండా, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పద్మమ్మ, పలువురు రాజకీయ నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నారాయణపేట రూరల్: విద్యారంగ అభివృద్ధే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. జూనియర్ కళాశాల లెక్చరర్ల జేఏసీ అధ్యక్షుడు పటేల్ రాంరెడ్డితో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చొరవతో జిల్లాలో పలు విద్యాసంస్థలు కొత్తగా వచ్చాయని అన్నారు. ఇటీవల రూ.60లక్షలను కోయిలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధనపు తరగతి గదుల నిర్మాణం, గ్రంథాలయం ఏర్పాటుకు వినియోగిస్తున్నారని తెలిపారు. సమావేశంలో మునిస్వామి, రాములు, అనంత్‌రెడ్డి, ఆర్‌సీరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్ ధరలు

నారాయణపేట: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం ఆముదాలు క్వింటాల్‌కు రూ.6,005లు పలికింది. శనగలు రూ.4,819లు, పెసర రూ.8,102, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,200, కనిష్ఠంగా రూ. 3,500, జొన్నలు గరిష్ఠంగా రూ.5,111, కనిష్ఠంగా రూ.4,309, ఆలసందలు గరిష్ఠంగా 6,396, కనిష్ఠంగా రూ.3,903, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ. 8,489, కనిష్ఠంగా రూ.8,080, తెల్ల కందులు రూ.8,459, తెల్ల కుసుమలు గరిష్ఠంగా రూ.4,082, కనిష్ఠంగా రూ.3,963 పలికాయి. పత్తి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,300, కనిష్ఠంగా రూ.4,500 పలికాయి.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్ఎం ధనుంజయ మాట్లాడుతూ వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్, మోహన్‌రావు, మహేష్, జ్యోతి, మనోహర్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

30న శ్రీరామనవమి వేడుకలు

మాగనూర్: మండలంలోని నేరడగంలో 30న శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు. వీరాంజనేయస్వామి దేవాలయంలో సీతారామ చంద్రమూర్తి కల్యాణం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా దేవాలయం అభివృద్ధికి విరాళాలు అందజేసిన భక్తులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో రామాయణ సప్తాహం

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం రామాయణ సప్తాహం ఉపన్యాస కార్యక్రమాలు ప్రారంభించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఉపన్యాసకులు శ్రీశైలం, నీరజ, రజని తదితరులు శ్రీరామ పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు. ఏడు రోజుల పాటు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమం పూర్తయ్యిందని ఎంపీడీఓ రాజు తెలిపారు. బహిరంగసభ బుధవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు విధిగా హాజరుకావాలని తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్ నియామకం

ఊట్కూర్: మండలానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎస్.తిరుపతయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ సీ.హెచ్. తిరుపతిని సస్పెండ్ చేస్తున్నట్లు సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేయడంతో డీటీ విధులు నిర్వహిస్తున్న ఈయనకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గతంలో మాగనూర్ మండలంలో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు పట్టా చేశారని, ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో బయోమెట్రిక్ ఉన్నా సమయపాలన పాటించడం లేదని, భూములు విరాసత్ చేయడంలో నిబంధనలు పాటించడం లేదని, ఇతర అభియోగాలుపై కలెక్టర్ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

- సాధారణ వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: మున్సిపల్ ఆదాయాన్ని పెంచేలా కౌన్సిల్ పాలక వర్గం, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నారాయణపేట పురపాలక వార్షిక సాధారణ అంచనా బడ్జెట్ మొత్తం రూ.7.44కోట్లు, అందులో పన్ను రాబడి రూ.3.51కోట్లు, పన్నేతర రాబడి రూ.3.92కోట్లు కాగా, మిగులు బడ్జెట్ రూ.15.04 అంచనా వేశారు. ఈ బడ్జెట్‌కు కౌన్సిల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఇది వరకు ఉన్న స్లాటర్ హౌజ్ ప్రస్తుత మార్కెట్ అనుగుణంగా లేదని, ఎర్రగుట్ట వద్ద 600 గజాల్లో నూతనంగా రూ.50లక్షల వ్యయంతో నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 9వ వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద ప్రహరీ నిర్మాణానికి రూ.20లక్షలు వెచ్చించాలని మున్సిపల్ పాలకులు, అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో వస్తున్న పన్నులు కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకే సరిపోతుందని, మరింత ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సమస్యలపై చర్చ..

సరాఫ్ బజార్‌లో రోడ్డు ఇరుకు కావడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఇరువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ పాలకవర్గం సభ్యులు ఆ రోడ్డును విస్తరణ చేసేందుకు తీర్మానం చేసి ఇస్తే నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు మాట్లాడుతూ సరాఫ్ బజార్ ఎక్కడైనా రోడ్డు ఇరుకుగానే ఉంటుందని, అలా ఉంటే భద్రత ఉంటుందని చెప్పారు. మరో కౌన్సిలర్ ఇప్పటికే గోల్డ్‌సోక్ పేరిట రూ.20కోట్లు నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారని, వాటిని నిర్మిస్తే అందరికీ బాగుంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇంటింటికీ తాగునీరు అందించేలా మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, మున్సిపల్ కమిషనర్ సునిత, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నారాయణపేట రూరల్: పార్టీకి పట్టుకొమ్మలైన కార్యకర్తలు, వారి కుటుంబాలకు పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల అమ్మిరెడ్డిపల్లికి చెందిన సంజమోళ్ల నర్సింహులు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో పార్టీ తరఫున మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును సోమవారం మృతుడి భార్యకు ఇంటి వద్ద అందచేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, మృతిచెందితే వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేపూరి రాములు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీ



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధిలో పోటీ పడుతున్న సందర్భాన్ని చూస్తుంటే గర్వంగా ఉందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మందిపల్లిలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారని, పల్లెల అభివృద్ధితోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని అభివృద్ధి సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఖాయ్యుంపాష, అశోక్‌గౌడ్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతర మహోత్సవానికి ఆహ్వానం..

మండలంలోని బైరంపల్లి జాతర సందర్భంగా గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా జాతర వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సర్పంచ్ మంజుల మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి సంవత్సరం మారెమ్మవ్వ తల్లి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చి తరలి వస్తారన్నారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర ఉంటుందని తెలిపారు.

మతతత్వ పార్టీలను నిలువరించాలి



దామరగిద్దలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ



ర్యాలీ చేపడుతున్న సీపీఎం నాయకులు

నారాయణపేట టౌన్: దేశంలో మతోన్మాదం పెంచి పోషిస్తూ, సామాజిక దౌర్జన్యానికి కారణం అవుతూ దేశ సంపదను బడాబాబులకు దోచిపెడుతున్న బీజేపీని నిలువరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం జన చైతన్య యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ సమాజాన్ని, మనుధర్మ శాస్త్రాన్ని నెత్తికెత్తుకుంటున్న మతోన్మాద విధాలను తరిమికొట్టాలని అన్నారు. మహాత్మాగాంధీని చంపిన హంతకుడు గాడ్సే బొమ్మను పార్లమెంట్‌లో పెట్టారని అన్నారు. ప్రధాని మిత్రుడు అదానీకి ఈ దేశ సందను దోచిపెతున్నారని, పేద ప్రజలను పీడిస్తున్నారని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించడమే నేరంగా, ప్రశ్నించే వారే దేశద్రోహిగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముద్ర వేస్తుందని ఆరోపించారు. జిల్లా అభివృద్ధి కోసం నీరు, రవాణా సౌకర్యం అత్యవసరమని అందుకే పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలన్నారు. అక్కడి నుంచి బొమ్మన్ పాడ్, కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, క్యాతన్‌పల్లి మీదుగా దామర్‌గిద్ద మండల నుంచి నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. కార్యక్రమంలో రమణ, ధర్మనాయక్, అరుణ, జ్యోతి, వెంకటరామిరెడ్డి, గోపాల్, ఆంజనేయులు గౌడ్, బాల్‌రాం, నరహరి, హన్మంతు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన బస్సు యాత్రకు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. గందె చంద్రకాంత్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని దేశం నుంచి తరిమివేయాల్సిన సమయం దగ్గర ఆసన్నమైందన్నారు.

దామరగిద్ద: బస్సుయాత్రలో భాగంగా సోమవారం మండలం మీదుగా నారాయణపేట చేరుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ మాట్లాడుతూ.. జిల్లాకు సాగు నీటిని అందించే పేట కొడంగల్ ఎత్తిపోతల, కృష్ణ వికారాబాద్ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



మద్దూరు: పదోతరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఏబీవీపీ అధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయ ఆవరణలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని పాఠశాలలకు చెందిన 530 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రఘు, సాయిలు, విజయ్, భరత్, కాశీ పాల్గొన్నారు.

మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని గార్లపల్లిలో ప్రాథమిక పాఠశాలకు సోమవారం స్మార్ట్ టీవీని వీజేఆర్ అధ్యక్షుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అందించారు. హెచ్ఎం శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కోస్గి: మున్సిపాలిటీ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలో కొత్తగా నిర్మించిన శివాలయంలో కాశీ విశ్వనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న మహోత్సవంలో చివరి రోజు సోమవారం తెల్లవారు జామున నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం నాభిశిల దేవి ప్రతిష్ఠ అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ప్రజా చైతన్య యాత్రకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న సీపీఎం నాయకులు

మక్తల్: ప్రజా చైతన్య యాత్ర జిల్లాలోకి వచ్చిన సందర్భంగా మండల నుంచి సీపీఎం నాయకులు స్వాగతం పలికేందుకు భారీగా తరలివెళ్లారు. ఆంజనేయులు మాట్లాడుతూ.. మార్చి 24 నుంచి 29 వరకు నిర్వహించే జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద, కార్పొరేట్ విధానాలు పెరిగాయని, శరవేగంగా ప్రభుత్వ సంస్థలైన ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులను అమ్మేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యవంతం చేసి బీజేపీని గద్దె దిగే వరకు పోరాటం చేస్తామన్నారు. తరలిని వారిలో నర్సింహ, చిన్న నర్సింహులు, సాయికేత్, శంకర్, భరత్‌కుమార్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నికలు

మక్తల్: పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడు కర్రెం పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా బండారి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా బ్యాగరి వెంకటేష్, కోశాధికారిగా కర్రెం రవికుమార్, ఉప కోశాధికారిగా త్రిమూర్తి, సాంస్కృతిక కార్యదర్శిగా తరుణ్, పరంజ్యోతి, కార్యవర్గ సభ్యులుగా కర్రెం అంజప్ప, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో గెలుపొందిన వారికి పూలమాల, శాలువతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ర్యాలీతో అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరుకోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎన్నికల అధికారులు సూర్యనారాయణ, తులశప్ప, నారాయణ, కోరి మారెప్ప, నారాయణ తదితరులు వ్యవహరించారు.

మద్దూరు సంతలకు వేలం

- రూ.26.14లక్షల ఆదాయం
- గతేడాది కంటే రూ.15.51లక్షలు తగ్గిన వైనం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

మద్దూరు: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంతబజారు, పశువుల సంత వేలం సోమవారం సచివాలయం వద్ద సర్పంచ్ అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ రెండు సంతలు కలిపి రూ.26.14లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. సంత బజారుకు కురుమూర్తిగౌడ్ రూ.11.62లక్షలు, పశువుల సంతకు కృష్ణారెడ్డి రూ.14లక్షల పాటపాడి దక్కించుకున్నారు. గతేడాది ఈ రెండు సంతలకు కలిపి రూ.41.65 లక్షలు పంచాయతీకి ఆదాయం రాగా, ఈ ఏడాది రెండు సంతలకు కలిపి రూ.26.14 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. గతేడాది కంటే రూ.15.51లక్షలు తక్కువకు పాడారు. వేలం పాటదారులందరూ కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి భారీగా గండి కొట్టారు. పట్టణంలో గురువారం నిర్వహించే సంతబజారు, పశువుల సంత వేలంలో పాటపాడిన వారు పంచాయతీ నిబంధనల ప్రకారమే పన్ను వసూలు చేయాలని సర్పంచ్ సూచించారు. అంతకు ముందు కార్యదర్శి వెంకటేష్ వేలం పాటదారులకు నియమనిబంధనలు వివరించి వేలం పాటను ప్రారంభించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ పరీక్షల పరిశీలన

మద్దూరు: మండలంలోని మద్దూరు, చింతల్‌దిన్నె, లక్కాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ పరీక్షలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ సోమవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎఫ్ఎల్ఎన్ విధానం ప్రాథమిక స్థాయిలో మంచి ఫలితాలను ఇస్తుండడంతో ఉన్నత పాఠశాలలో కూడా నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

బల్దియా బడ్జెట్ రూ.10.06 కోట్లు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

కోస్గి: మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.10.06 కోట్ల అంచనా బడ్జెట్‌ను సోమవారం కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24 గాను పన్ను రాబడి నుంచి రూ.130 లక్షలు, పన్నేతర రాబడి నుంచి రూ.295.42 లక్షలు, 2022–23 ఆర్థిక సంవత్సరానికి మిగులు రూ.36.23 లక్షలు అంచనా వేసినట్లు కమిషనర్ పూర్ణచందర్ రావు సభకు వివరించారు. వేతనాల చెల్లింపు, పారిశుద్ధ్య నిర్వాహణ, విద్యుత్ బిల్లులు, హరిత నిధి వంటి వ్యయాల కోసం రూ.300.84 లక్షలు, ఇతర ఖర్చులకు రూ.67.46 లక్షలు, డంపింగ్ యార్డు నిర్వహణ, కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.36.19 లక్షలు కేటాయించినట్లు సభలో తెలుపగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, కౌన్సిలర్లు బాలేష్, శ్రీను, జనార్దన్‌రెడ్డి, లక్ష్మి, బందెప్ప, ఎల్లమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, మంజుల, చంద్రకళ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అధైర్యపడొద్దు

- డీఈఓ లియాఖత్ అలీ
- పదో తరగతి పరీక్షల ఏర్పాట్ల పరిశీలన



కాన్‌కుర్తిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ లియాఖత్ అలీ

దామరగిద్ద: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా చదివింది శ్రద్ధతో రాసి మంచి ఫలితాలు సాధించాలని డీఈఓ లియాఖత్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా పర్యవేక్షించారు. పాఠశాలలో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై హెచ్ఎం విశ్వనాథ్‌ను ఆరా తీశారు. విద్యార్థుల హాల్ టికెట్‌లో తప్పులు లేకుండా సరిచేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అనంతరం స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాల విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను అనుమతి లేకుండా విహారయాత్రకు తీసుకువెళ్లడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ఎండీఎం జిల్లా ఇన్‌చార్జ్ యాదయ్యశెట్టి, కాన్‌కుర్తి హెచ్ఎం విశ్వనాథ్, సీఆర్‌పీ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబానికి చేయూత


దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తికి చెందిన ఉపాధ్యాయుడు మణికంఠ నెల రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబానికి మండల ఉపాధ్యాయులందరూ చేయూత నందించారు. సోమవారం కాన్‌కుర్తిలో డీఈఓ లియాఖత్ అలీ చేతుల మీదుగా ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.55వేల చెక్కును ఉపాధ్యాయుడి కూతురు మోనాక్షితకు అందజేశారు. కార్యక్రమంలో ఎండీఎం జిల్లా ఇన్‌చార్జ్ యాదయ్యశెట్టి, ఉపాధ్యాయులు దశరథ్, బాలాజీ, శ్రీనివాస్, అంబరీష్, మహేష్, ఉసేనప్ప, శ్రీధర్, సీఆర్‌పీ మహిపాల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మరికల్: అభివృద్ధి పనులకు గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని వైస్ ఎంపీపీ రవికుమార్, సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. మరికల్‌లోని హనుమాన్‌వాడ రహదారి సీసీరోడ్డు పనులను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యే సహకారంతో మరికల్ అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. ఉపసర్పంచ్ శివ, ఎంపీటీసీ గోపాల్, రాజేష్, హన్మిరెడ్డి, జగదీశ్, కృష్ణయ్య, సుదాకార్‌గౌడ్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మక్తల్: ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ మహేశ్వరి తెలిపారు. మండలంలోని జక్లేర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు భోజన వసతి ఏర్పాటు చేశామని, బాలింతలు, గర్భిణులకు గుడ్లు, బాలామృతం, పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీసీ పారిజాత పాల్గొన్నారు.

లయన్ డిస్ట్రిక్ గవర్నర్‌గా హరినారాయణ్‌బట్టడ్

నారాయణపేట రూరల్: లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా మున్సిపల్ వైస్ చైర్మన్, బులియన్ మార్చంట్ నాయకుడు హరినారాయణ్‌బట్టడ్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందినట్లు స్థానిక అధ్యక్షుడు మొల్గాన్ జనార్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ లయన్ డైరెక్టర్ వీరేంద్రకుమార్‌మిత్ర చేతుల మీదుగా బట్టడ్‌కు గవర్నర్‌గా ఎన్నికైనట్లు సూచించే పిన్‌ను చొక్కాకు తొడిగారు. రాబోవు రోజుల్లో లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచిస్తూ గత రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలపై అభినందించారు. నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన లయన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, విద్యాసాగర్ రెడ్డి, భీమయ్య, జనార్ధన్, సాయినాథ్, రవికుమార్‌గౌడ్, కన్నజగదీష్, వెంకటయ్య పాల్గొన్నారు.



చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



ధన్వాడ: ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రలలో చేర్పించాలని సూపర్‌వైజర్ వెంకట కమలాదేవి అన్నారు. సోమవారం మండలంలోని మందిపల్లిపాత తండాలో పిల్లల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. పోషన్‌పక్షంలో భాగంగా చిరుధాన్యాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, హెచ్ఎం నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే మా లక్ష్యం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



పంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, పెద్దపూర్, మన్నాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. తిమ్మారెడ్డిపల్లిలో పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం కోసం అదనపు నిధులు మంజూరు చేస్తానన్నారు. గ్రామంలో వేసినా సీసీ రోడ్లను చూశారు. పెద్దపూర్, మన్నాపూర్‌లో కొత్త పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మన్నాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారంపై తల్లులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వర్, వీరారెడ్డి, సలీం, బాల్‌సింగ్‌నాయక్, హన్మిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ బాలయ్య అన్నారు. మండలంలోని బైరంకొండ గ్రామంలో సోమవారం రాత్రి పోలీసుశాఖ ఆధ్వర్యంలో కళాబృందం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థ, సైబర్‌నేరాలు, బాలకలను వేధిస్తే చట్టాలు, రోడ్డు భద్రతా నియమాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, లీడర్‌షిప్ లక్షణాలు, పౌరుల హక్కులపై నాటికల రూపంలో తెలియచేశారు. అత్యవసర సమయంలో డయల్ 100, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.